రవికి ఉత్తమ పాస్‌పోర్ట్ కేంద్రం ఎంప్లాయ్ అవార్డు

పాస్‌పోర్ట్ కేంద్రం ఉత్తమ ఎంప్లాయ్ అవార్డ్ అందుకుంటున్న గోల్కొండ రవి

మహబూబాబాద్ రూరల్, జనవరి 26 : జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్ట్ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న గోల్కొండ రవికి ఉత్తమ పాస్‌పోర్ట్ కేంద్రం ఎంప్లాయ్ అవార్డు అందుకున్నారు. సికింద్రాబాద్ రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీస్‌లో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో రీజినల్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ జే స్నేహజ అందజేశారు. ఆయనను సూపరింటెండెంట్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ రవికుమార్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సైదానాయక్, అనిల్ కుమార్ అభినందించారు.

పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత

కేసీఆర్ సోదరి సకలమ్మకు ఘన నివాళి

మహబూబాబాద్ రూరల్, జనవరి 26 : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సోదరి సకలమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం వారి స్వగ్రామమైన మేడ్పల్‌కు మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, మాజీ ఎంపీ మాలోత్ కవిత చేరుకొని, సకలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

ఫ్రెండ్స్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడిగా రవీందర్‌గౌడ్

కేసముద్రం, జనవరి 26: మండల ఫ్రెండ్స్ వెల్ఫేర్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని కల్వల గ్రామానికి చెందిన మోడెం రవీందర్‌గౌడ్ ఎన్నికయ్యాడు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంఘం సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సైదులు, ప్రధాన కార్యదర్శిగా సామల నరసయ్య, సహాయ కార్యదర్శిగా గుంటి రాంచందర్, కోశాధికారిగా పిల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. కొండ్రెడ్డి రవీందర్‌రెడ్డి, బచ్చు పరమేశ్వర్, చీకటి వెంకట్రామనర్సయ్య, రేణుకుంట్ల సుధాకర్, వేం దేవేందర్‌రెడ్డి, దల్వాయి శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు రెడ్యా పరామర్శ

నర్సింహులపేట/ చిన్నగూడూరు/ దంతాలపల్లి, జనవరి 26: పలు బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ ఆదివారం పరామర్శించారు. నర్సింహులపేటలో ఎరనాగి శ్రీను(49) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా మృతదేహంపై పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. మాజీ సర్పంచ్ బండ భిక్షంరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఖాజామియా, రమేశ్, జగదీశ్వర్, భిక్షం ఉన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లికి చెందిన దాసరి పాపమ్మ అనారోగ్యంతో మృతిచెందగా పార్థివదేహంపూ పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాంసింగ్, కొమిరెల్లి, అయూబ్‌పాషా, గంగరాజు, యాకి, సుధాకర్ ఉన్నారు. దంతాలపల్లి మండలం తూర్పుతండాలో గుగులోత్ ఈరి అనారోగ్యంతో మృతిచెందగా పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులు అర్పించారు. బీఆర్ఎస్ నాయకులు నూకల గౌతమ్‌రెడ్డి, కిషోర్‌కుమార్, రవి, శ్రీను, వెంకన్న పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధే శాశ్వతం

- మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్
- మరిపెడ మున్సిపల్ పాలకవర్గానికి ఘన సన్మానం

చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్

డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ కోటిలింగంను సన్మానిస్తున్న నాయకులు

మరిపెడ, జనవరి 26: రాజకీయాలు శాశ్వతం కాదు.. అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధే శాశ్వతంగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. ఆదివారం పురపాలక సంఘం ఆవరణలో కమిషనర్ కె.నరేష్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కౌన్సిల్ వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధే పట్టణంలో కనిపిస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా అభివృద్ధి శూన్యమని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు తుది దశలో రూ.25కోట్లు టెండర్లను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రద్దు చేయడంతో అభివృద్ధి ఆగిపోయిందన్నారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిల్లా గ్రంథాలయ సంస్థల మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్‌రావుతో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ సింధూ రవి, వైస్ చైర్మన్ ముద్దిరెడ్డి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్లు పరశురాములు, శ్రీను, హతిరాం, కిషన్, శ్రీనివాస్, ప్రగతి శ్రీపాల్‌రెడ్డి, రేఖ లలితా వెంకటేశ్వర్లు, గంధసిరి ఉపేంద్ర, గుగులోత్ పద్మ కోటేశ్, పానుగోతు సుజాత వెంకన్న, బయ్య భిక్షం, జాటోత్ కౌసల్య గణేశ్, కోఆప్షన్ మెంబర్స్ ఉప్పల నాగేశ్వరావు, షేక్ ఖైరున్ హుస్సేన్, మాక్సుద్, దేవరశెట్టి శ్రీలత లక్ష్మీనారయణ సన్మానించారు. జిల్లా నాయకులు అచ్యుత్‌రావు, కుడితి మహేందర్‌రెడ్డి, తాళ్లపెల్లి శ్రీనివాస్, గుగులోత్ వెంకన్న, రాంబాబు, రవీందర్, గాదే అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

డోర్నకల్ మున్సిపల్ పాలకవర్గానికి..

డోర్నకల్: మున్సిపల్ పాలకవర్గం ఆత్మీయ వీడ్కోలు సమావేశం ఆదివారం జైనభవన్‌లో ఘనంగా జరిగింది. మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, వార్డు కౌన్సిలర్లు కాలా సురేందర్‌కుమార్ జైన్, పోటు జనార్దన్, బోరగల్ల శరత్‌బాబు, కొండేటి హేమచంద్రశేఖర్, బాసిక అశోక్, కాలా మౌనిక జైన్, కొత్త రాధిక, కందుల అరుణ, తేజావత్ సంధ్యారాణి, శీలం భాగ్యలక్ష్మి, బోడ అమల, పర్వీన్‌సుల్తాన్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు మారబోయిన రాంభద్రం, అజిత్ మియా, పచ్చిపాల మల్లికాంబ, ముద్దం రోడాను శాలువాతో సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి, మున్సిపల్ అధికారులు నాగరాజు, అహ్మద్ పాల్గొన్నారు.

వంద అడుగుల జాతీయ జెండా ప్రదర్శన

ఆర్మీ రిటైర్డ్ అధికారి కర్నల్ భిక్షపతిని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ సోమేశ్వరరావు

తొర్రూరు, జనవరి 26: గణతంత్ర వేడుకల్లో భాగంగా పట్టణంలో చేసిన 100 అడుగుల జాతీయ జెండా ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆర్మీ రిటైర్డ్ అధికారి కర్నల్ భిక్షపతి చేతుల మీదుగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ సోమేశ్వరరావు మాట్లాడారు. పార్టీ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు పొనుగంటి సోమేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, పట్టణ అధ్యక్షుడు బిందు శ్రీనివాస్, శ్రీనివాస్, పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ.ప్రదీప్‌రెడ్డి, పార్టీ కార్యదర్శి కుర్ర శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకుడు ఎన్నమనేని శ్రీనివాసరావు, మనిరాజు పాల్గొన్నారు.

సకాలంలో వైద్యం అందక పేషెంట్ నరకయాతన

పేషెంట్‌కు చికిత్స అందిస్తున్న తాత్కాలిక సిబ్బంది

గూడూరు, జనవరి 26: పురుగుల మందు తాగిన ఓ వ్యక్తికి సకాలంలో వైద్యం అందక నరకయాతన అనుభవించాడు. ఈ ఘటన మండలంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లో ఆదివారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మచ్చర్లకు చెందిన ఓ వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు తాళలేక పురుగులమందు తాగాడు. చికిత్స కోసం కుటుంబ సభ్యులు స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో బాధితుడు రెండు గంటలపాటు నరకయాతన పడ్డాడు. చివరికి దవాఖానలోని తాత్కాలిక సిబ్బంది వైద్యం చేసి పురుగుల మందు కక్కించాడు. ఆతర్వాత దవాఖానకు వచ్చిన డాక్టర్ పేషెంట్‌ను పరిశీలించాడు.

అమ్మాపురం కాదని ఖానాపురానికి మార్పు

సంక్షేమ పథకాల ప్రారంభానికి రాత్రికి రాత్రే మారిన గ్రామం

తొర్రూరు, జనవరి 26: రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించేందుకు తొర్రూరు మండలంలో ఎంచుకున్న గ్రామాన్ని రాత్రికి రాత్రే మార్చేశారు. తొలుత మండలంలోని అమ్మాపురాన్ని ఎంచుకోగా రాత్రికి రాత్రే పక్కనున్న ఖానాపురాన్ని ఎంపిక చేశారు. అమ్మాపురం పెద్ద గ్రామం కావడం పలు రాజకీయ ప్రభావాలు ఉండడంతో ఇక్కడే నిర్వహిస్తారని గ్రామస్తులు భావించారు. కానీ ఆఖరులో చిన్న గ్రామమైన ఖానాపురాన్ని ఎంపిక చేయడంతో వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. పెద్ద గ్రామంలో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరసన తెలుపుతారనే భయంతోనే ఈ మార్పు చేసినట్లు తెలిసింది. అమ్మాపురంలో 5వేలకు పైగా జనాభా ఉండగా, ఖానాపురంలో 905 జనాభా మాత్రమే ఉందని, సంక్షేమ పథకాలు తక్కువ సంఖ్యలో అమలు చేసి, ప్రజలను మరోసారి మభ్యపెట్టవచ్చనే ఆలోచనతోనే ఇలా చేశారని అమ్మాపురం గ్రామస్తుడు గుంటుక వెంకటేశ్ ఆరోపించారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో చోరీ

డోర్నకల్, జనవరి 26: ఉయ్యాలవాడ సీతారామచంద్రస్వామి ఆలయంలో శనివారం చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు అనిరుధ్ ఆచార్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలయంలో శనివారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు తాళానికి ఉన్న చైన్ కట్‌చేసి బంగారు, వెండి ఆభరణాలు అపహరించారు. ఆలయంలో స్వామి, అమ్మవారు 90 తులాల వెండి ఆభరణాలు, రెండున్నర తులాలు బంగారు ఆభరణాలు చోరీ చేశారు. చోరీ స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. ఆలయ ట్రస్ట్ చైర్మన్ నున్న రమణ, గ్రామస్తులు నున్న మల్లికార్జున్, భాగం నరసింహరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ

పెద్దవంగర, జనవరి 26: మండల కేంద్రంలో సుంకరి చైతన్య-శ్రీనివాస్ దంపతుల ఆర్థికసాయంతో నిరుపేదలకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి ఆదివారం దుప్పట్లు పంపిణీ చేసి, నీటి బోర్‌ను ప్రారంభించారు. ఎన్నారై రాజేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, ఏఎంసీ చైర్మన్ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలకు డెకరేషన్, టెంట్ వితరణ

చిన్నగూడూరు, జనవరి 26: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు 1987-88లో పదో తరగతి చదివిన విద్యార్థులు రూ.20వేల విలువైన డెకరేషన్, టెంట్ బహూకరించారు. బాల్యంలో విద్యసభ్యసించిన పాఠశాలకు తమ వంతు సహకారం అందించిన పూర్వ విద్యార్థులను హెచ్ఎం రవికుమార్ అభినందించారు. పూర్వ విద్యార్థులు గాడిపల్లి శ్రీహరి, చక్రధర్, వీరనారాయణ, భిక్షపతి, డి.రమేశ్, నర్సయ్య, పి.రమేశ్, రూప్ల, రాజ్య, నాగన్న ఉన్నారు.

కోతుల కళేబరాల పరిశీలన

పరిశీలిస్తున్న పశువైద్యాధికారి రాజేందర్

కురవి, జనవరి 26: మండలంలోని బంచరాయితండా సమీపంలో మున్నేరు వాగు వద్ద కుప్పగా ఉన్న కోతుల కళేబరాలను మండల వైద్యాధికారి రాజేందర్, పోలీసులు, ఫారెస్ట్ అధికారులు ఆదివారం పరిశీలించారు. పశువైద్యాధికారి కోతుల కళేబరాలకు పోస్టుమార్టం చేశారు. సేకరించిన షాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. కాగా, కోతులను చంపిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు.

విరాళం అందజేస్తున్న సమ్మయ్యగౌడ్

కాటమయ్య గుడి నిర్మాణానికి విరాళం

కేసముద్రం, జనవరి 26: మండలంలోని ఇంటికన్నెలో కాలమయ్య గుడి నిర్మాణానికి గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆదివారం రూ.50,116 ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. గౌడ కులస్తులు బుర్ర కుమారస్వామి, కదిర రాజు, గంధసిరి మల్లయ్య, కదిర శ్రీను, బాల జగన్‌గౌడ్, నలమాస సందీప్, వెంకటేష్ ఉన్నారు.

తెరుచుకోని ప్రభుత్వ దవాఖాన

తాళం తీయని ప్రభుత్వ ఆస్పత్రి

తొర్రూరు, జనవరి 26: గణతంత్ర దినోత్సవం రోజు తొర్రూరు పట్టణంలోని ప్రభుత్వ ఆయుర్వేదిక్ ఆస్పత్రి తెరుచుకోలేదు. పీహెచ్‌సీ పక్కనున్న ఈ ఆస్పత్రి తాళాన్ని సంబంధిత అధికారులు తీయలేదు. ఆవరణలో రిపబ్లిక్ డే వేడుకలు నిర్వహించలేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఉదయం 9 గంటల్లోగా జాతీయ జెండాను ఆవిష్కరించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

దుబ్బతండా జీపీ ఆఫీస్ ప్రారంభం

దంతాలపల్లి, జనవరి 26: మండలంలో దుబ్బతండా గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని డోర్నకల్ ఎమ్మెల్యే, విప్ జాటోత్ రాంచంద్రనాయక్ ఆదివారం ప్రారంభించారు. తూర్పుతండా గ్రామ పంచాయతీ నుంచి రేళ్ళతండా, మేఘ్యాతండా, దుబ్బతండాలను కలిపి దుబ్బతండా కేంద్రంగా నూతన జీపీ ఏర్పాటు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నూతన జీపీ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీడీవో వివేక్‌రాం, ఎంపీవో అఫ్సర్‌పాషా, నాయకులు రవి, మంగిలాల్, భట్టు నాయక్, సురేష్ పాల్గొన్నారు.

రాజడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంధ పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటిదాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గితాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్పుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాలలో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.

రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్తున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**



సూచీలకు బడ్జెటే దిక్సూచి

మార్కెట్ పల్స్

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అల